అద్దంలా రహదారులు

- 86వ వార్డులో రూ.86.4 లక్షలతో రోడ్ల నిర్మాణం
- స్థానికుల హర్షం



ఫకీర్‌తక్యా నుంచి వీపీఎస్ సెంటర్ వరకు రూ.19.90 లక్షలతో నిర్మించిన రోడ్డు



రాజీవ్‌నగర్ రోడ్డు నుంచి వుడా ఫేజ్-3 వరకు సుమారు రూ.30 లక్షలతో నిర్మించిన రహదారి



సైమన్‌నగర్‌లో రూ.16.60 లక్షలతో రహదారి నిర్మాణం

కూర్మన్నపాలెం: రహదారులన్నీ అద్దంలా మెరుస్తున్నాయి. ఎక్కడ చూసినా సిమెంట్, తారు రోడ్లు అందంగా కనిపిస్తున్నాయి. జీవీఎంసీ 86వ వార్డులో గతంలో రోడ్లు అధ్వానంగా ఉండేవి. ఈ విషయాన్ని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించిన ఆయన నూతన రహదారులకు ప్రణాళికలు సిద్ధం చేయించారు. జీవీఎంసీ నిధులతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలను నిర్మించారు. రహదారి సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- జీవీఎంసీ 86వ వార్డు పరిధి ఫకీర్‌తక్యా నుంచి వీపీఎస్ సెంటర్ వరకు రూ.19.90 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మించారు.
- మాతృశ్రీనగర్ లేఔట్ నుంచి రాజీవ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి వరకు రూ. 19.90 లక్షలతో రహదారి నిర్మాణం జరిగింది.
- రాజీవ్‌నగర్ రోడ్డు నుంచి ఉడా ఫేజ్-3 వరకు సుమారు 30 లక్షల రూపాయలతో రహదారులు నిర్మించారు.
- సైమన్‌నగర్‌లో 16.60 లక్షల నిధులతో రోడ్లు నిర్మించారు.

వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

రోడ్ల సమస్య తీరింది

గతంలో మా వార్డులో రోడ్లన్నీ శిథిలమైపోయాయి. ప్రయాణమంటేనే భయపడేవాళ్లం. రాత్రివేళల్లో ప్రయాణం చేయలేక వాయిదా వేసుకునే వాళ్లం. వర్షం పడితే మరింత అధ్వానంగా ఉండేది. గుంతల్లో నీరు చేరి ఏది రహదారి, ఏది గుంత అనేది తెలిసేది కాదు. ఇప్పుడు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. సమస్య పరిష్కరించారు.

– విశ్వభూషణ్, రాజీవ్‌నగర్

సాఫీగా ప్రయాణిస్తున్నాం

నేను వ్యాపారం నిమిత్తం రాకపోకలు ఎక్కువగా ఉండేవి. రోడ్డు సరిగ్గా లేక చాలా ఇబ్బంది పడేవాడిని. ఆ రోడ్లపై ప్రయాణం చేయలేక వ్యాపారం కూడ మానుకున్నా. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే చొరవతో మా ప్రాంతంలో రోడ్డు బాగు పడ్డాయి. ప్రయాణం సాఫీగా సాగుతోంది. మళ్లీ వ్యాపారం ప్రారంభించాను.

– ఈశ్వరరావు, మాతృశ్రీనగర్ లేఔట్

సచివాలయ వ్యవస్థతో చేరువైన సంక్షేమం



వాంబే కాలనీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని ప్రాంతాల్లో సచివాలయ వ్యవస్థను అందుబాటులోకి తెచ్చారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జీవీఎంసీ 65వ వార్డు వాంబే కాలనీ వద్ద షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని రెండు సచివాలయాలుగా నిర్మించేందుకు రూ.16 లక్షలతో నిర్మాణ పనులకు, అలాగే సంజీవిగిరి కాలనీ వద్ద రూ.10 లక్షలతో ప్రధాన కాలువ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడితో కలసి సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సేవలు పొందాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి పారదర్శకంగా పాలన సాగిస్తున్నారని, అనేక సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో లోకనాథం, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, జుత్తు లక్ష్మి, మంత్రి మంజుల, దేముడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల మనోభావాలు దెబ్బ తినేలా కేంద్రం తీరు



935వ రోజు దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ద్వారా కార్మికుల మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న కేంద్రప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు వస్తుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రజల నుంచి వస్తున్న వ్యతిరేకతే ఇందుకు నిదర్శనమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 935వ రోజు సోమవారం, బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందని పార్లమెంట్‌లో ప్రకటన చేసే వరకు తమ ఉద్యమాలు ఆగవన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వరంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో, మహనీయుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో సోమవారం ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, దళిత హక్కుల పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలో వచ్చిన తర్వాత తొమ్మిదేళ్లలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఇప్పుడున్న ఉద్యోగాలు పోవడంతో పాటు భావితరాలకు ఉపాధి ఉండదన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఐక్య పోరాటాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.కిరణ్, బి.ప్రకాష్, ఎ.జనార్దన్, ఎస్.మధురెడ్డి, కె.రమణ, వనజాక్షి, దేవుడమ్మ, జి.జయ తదితరులు పాల్గొన్నారు.

కోలుకున్న యువతి అప్పగింత

అల్లిపురం: ఫిట్స్‌తో రోడ్డుపై పడి ఉన్న ఓ యువతికి వైద్య సాయం అందించి, కోలుకున్న అనంతరం ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా, కోట బొమ్మాళి మండలం, లోకంది గ్రామానికి చెందిన బొత్తరా కొండమ్మ మే 31న ఫిట్స్‌తో రోడ్డుపై పడి ఉండటాన్ని మహారాణిపేట పోలీసులు గమనించారు. శరీరంపై గాయాలతో బాధపడుతున్న ఆమె సమాచారాన్ని టీఎస్ఆర్ కాంప్లెక్స్ లోని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తెలియజేశారు. అక్కడ యువతికి చికిత్స అందజేయడంతో కోలుకుంది. కొండమ్మ నుంచి వివరాలు సేకరించి ఆమె అమ్మమ్మను షెల్టర్‌కు పిలిపించి అప్పగించినట్లు ఏయూటీడీ ప్రతినిధి వాసు తెలిపారు.

క్లుప్తంగా

6న కృష్ణాష్టమి వేడుకలు

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీ చెట్టివానిపాలేనికి చెందిన శ్రీకృష్ణ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన శ్రీ కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు కర్రి దేవేంద్ర, పోలినాయుడు, ఎం.కోటి, కె.దుర్గారావు, బి.రాజు, ఇ.ముసిలినాయుడు, ఇ.అప్పారావు పాల్గొన్నారు.

మాజీ సైనికోద్యోగికి సత్కారం



మాజీ సైనికోద్యోగి శ్రీనివాసరావును సత్కరిస్తున్న దృశ్యం

అగనంపూడి: ఆర్మీలో సుబేదారుగా విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన అగనంపూడికి చెందిన ఎర్ని శ్రీనివాసరావును మాజీ సైనికోద్యోగుల సంఘం ప్రతినిధులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. శ్రీనివాసరావు దంపతులకు పైడిమాంబ ఆర్మీ ఉద్యోగుల సంఘం నాయకులు, గ్రామ నాయకులు ఘన సన్మానం చేశారు. సైనికోద్యోగిగా ఆయన సేవలను కొనియాడారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో పాల్గొనడం మరపురాని ఓ అనుభూతి అన్నారు. కార్యక్రమంలో నాయకులు నెల్లి శ్రీనివాసరావు, వంకర రాము, ఎం.వి.రమణ, బి.సత్యనారాయణ, వి.నారాయణరావు, త్రినాథ్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

11న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ మహాజన సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 11వ సర్వసభ్య సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించనున్న సభలో 2022–23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదిక అందజేత, సంఘం సభ్యత్వాన్ని రూ. 20 నుంచి రూ. 30కు పెంచడం, పదవీ విరమణ ఫండ్ రూ. 5 నుంచి రూ. 10కు పెంచడం తదితర అంశాలను చర్చించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య తెలిపారు. సభ్యులందరూ హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు ఐసీఐసీఐ బ్యాంకు రిలేషన్ షిప్ మేనేజర్ పోస్టులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఏ, బీకాం, బీఎస్సీ ఏదైనా డిగ్రీ అర్హత కలిగి, 25 సంవత్సరాల లోపు వయసు కలిగిన ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఎక్కడైనా విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఎంపికైన వారికి రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలు వార్షిక వేతనం ఉంటుందని వివరించారు.

వామపక్షాల ఆందోళన



ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నాయకులు

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, విద్యుత్ చార్జీల పెంపు, అధిక ధరలు, గంగవరం కాలుష్యం తదితర సమస్యలపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. గాజువాక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కమ్యూనిస్టు నాయకుడు ఎం.రాంబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

లక్ష్మమ్మకు నివాళి



లక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

అగనంపూడి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఉక్కు కార్మిక సంఘం నాయకుడు శీరంశెట్టి గోవిందరావు మాతృమూర్తి లక్ష్మమ్మకు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి నివాళులర్పించారు. 85వ వార్డు దిబ్బపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, నాయకులు నక్కా రమణబాబు, నగిరెడ్డి రామారావు, పిళ్లా కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

'బొబ్బరి' సేవలు ఎనలేనివి

ఆర్ఈసీఎస్ మాజీ డైరెక్టర్, అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ మాజీ చైర్మన్ బొబ్బరి నారాయణరావు సేవలు ఎనలేనివని మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య అన్నారు. 79వ వార్డు అగనంపూడిలో ఏర్పాటు చేసిన సంతాపసభలో నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పల్లా శ్రీనివాసరావు, పరవాడ మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

కనులపండువగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

తిరుమల నగర్‌లో '5 ఎస్' పై అవగాహన



5ఎస్ విధానాలపై అవగాహన కల్పిస్తున్న స్టీల్‌ప్లాంట్ అధికారులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగ అధికారులు సోమవారం 5ఎస్ విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. 5ఎస్ టీమ్ సభ్యుడు శరత్ మాట్లాడుతూ ఇంట్లో గానీ, పరిశ్రమల్లో గానీ ఏ పని చేసినా 5ఎస్ (సార్ట్, సెట్ ఇన్ ఆర్డర్, షైన్, స్టాండరైజ్, సస్టెయిన్) పద్ధతి పాటించాలన్నారు. ఇప్పటికే తిరుమలనగర్ వాసులు ఎంతో క్రమశిక్షణతో ఉన్నారని, ఇటువంటి కార్యక్రమాలతో కాలనీవాసుల్లో మరింత శ్రద్ధ, చైతన్యం కలుగుతాయన్నారు. 5ఎస్ విధానంలో 'అవసరమైనవి.. అనవసరమైనవి వేరుచేయుట, అవసరమైన వాటిని క్రమపద్ధతిలో అమర్చడం, అనవసరమైన వాటిని తొలగించి, తరలించడం శుభ్రపరచడం, స్థిరంగా 5ఎస్ విధానాలను కొనసాగించడం, 5 ఎస్ విధానాలను కొనసాగిస్తూ వాటిని మరింత మెరుగుపరిచే విధంగా చేయడం' వంటివి చేయాలన్నారు. కార్యక్రమంలో 5ఎస్ టీమ్ సభ్యులు శ్రీకాంత్, ప్రవీణ్, వర్మ, రంగయ్యనాయుడు, తిరుమలనగర్ అసోసియేషన్ సభ్యులు నాగభూషణం, పరమానందం, సన్యాసిరావు, ఇతర మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా 'నరసింహ'

- జిల్లా స్థాయిలో ఎంపికైన నడుపూరు హైస్కూల్ టీచర్



నరసింహను సత్కరిస్తున్న హెచ్‌ఎం తదితరులు

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన సోషల్ ఉపాధ్యాయుడు ఎన్. నరసింహ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా సెంటా (సెంటర్ ఫర్ టీచర్స్ అక్రిడిషన్) అవార్డులు ప్రకటించింది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ చేసుకుని పరీక్షలు రాశారు. ఈ రాత పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన నరసింహ జిల్లా నుంచి సోషల్ విభాగంలో ప్రథమ స్థానం సాధించి, ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా ఏయూ కన్వెన్షన్ హాల్లో మంగళవారం నిర్వహించనున్న కార్యక్రమంలో నరసింహను ఉన్నతాధికారులు సన్మానించనున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాఠశాలలో సోమవారం సత్కరించారు.

పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలి



దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యానారాయణలను సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్-101 గవర్నర్ శుభ, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: పిల్లల్లో నైతిక విలువలు పెంపొందేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కవయిత్రి, సెయింట్ జోసెఫ్ వుమన్స్ కాలేజీ లెక్చరర్ దేవులపల్లి పద్మజ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు విశ్వనాథ జయప్రభాశర్మ అధ్యక్షతన వైశాఖి మహిళా భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ నేటి బాలబాలికలను పెద్దల పట్ల గౌరవ భావాలు ప్రకటించేలా పెంచాలని సూచించారు. ప్రతి ఇంట్లో మాతృభాషలో మాట్లాడాలని, తెలుగు గొప్పదనాన్ని పిల్లలకు చెప్పాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెన్నెల సూర్యనారాయణ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక పరిపక్వతకు ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, రాంపురం బాలికల జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్(పీజీటీ) కశిరెడ్డి వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులకు దేశ సంస్కృతీ సంప్రదాయాల ప్రాధాన్యాన్ని తెలియజేయాలన్నారు. ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యనారాయణ మాస్టార్లను వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అనంతరం క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. క్లబ్ కార్యదర్శి ఎస్.రోజారాణి, కోశాధికారి జి.షీలా రాణి, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులే పాలకులైన వేళ..

- ఉత్సాహంగా 'యువ మంతన్' జీ 20 మాక్ సదస్సు
- వివిధ దేశాల ప్రధానులు, ప్రతినిధులుగా ఆకట్టుకున్న విద్యార్థులు



జీ 20 మాక్ సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని మోదీ, పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులుగా విద్యార్థులు



జీ 20 సమావేశంలో మాట్లాడుతున్న సౌదీ అరేబియా ప్రతినిధి

అక్కిరెడ్డిపాలెం: మాక్ సదస్సుల ద్వారా విద్యార్థుల్లో విశ్లేషణాత్మక శక్తిని వెలికితీయవచ్చని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయిని ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై ఆసక్తి పెరుగుతుందన్నారు. ఈ నెల 9, 10 తేదీల్లో న్యూ ఢిల్లీలో జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో పాఠశాలలో సోమవారం యువమంతన్ జీ–20 మాక్ సదస్సును నిర్వహించారు. విద్యార్థులు వివిధ దేశాల ప్రతినిధులుగా ఆకట్టుకున్నారు.

'మాక్' సదస్సు సాగిందిలా..

ముందుగా జీ 20 సదస్సుకు హాజరైన అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, సౌత్‌కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, సౌత్ ఆఫ్రికా, టర్కీ, యునైటెడ్ కింగ్‌డమ్, యునైటెడ్ స్టేట్స్ దేశాల ప్రతినిధులకు ఆతిథ్య దేశమైన భారత్ ప్రధాని గౌరవ సూచకంగా శాలువాలతో సత్కరించారు. అనంతరం భారతదేశం ఇప్పటివరకు సాధించిన విజయాలను, అధిగమించిన పరిస్థితులను ప్రధాని మోదీ వివరించారు. కోవిడ్–2019ను ఎదుర్కొన్న తీరుతో పాటు వ్యవసాయ రంగం, వైద్య రంగం, పరిశోధనా రంగాల్లో ప్రగతిని వివరించారు. చంద్రయాన్–3 తో ప్రపంచం యావత్తు భారత్ వైపు చూసే విధంగా చేసిన అంతరిక్ష ప్రయోగాలను తెలియజేశారు. అనంతరం ఆయా దేశాల ప్రతినిధులు తాము సాధించిన విజయాలు, ఆయా దేశాల అభివృద్ధిపై ప్రసంగించారు. విద్యార్థులు ఆయా దేశాల ప్రధానులుగా వేష, భాషలతో అలరించారు. కార్యక్రమానికి రూపకల్పన చేసిన ప్రొగ్రాం ఇన్‌చార్జి కుమారస్వామి, ఉపాధ్యాయులు బి.ప్రసాదరావు, బి.శంకరమ్మ, పద్మజ, జి.పద్మ, సుబ్బలక్ష్మి, రవిచంద్ తదితరులను హెచ్‌ఎం కాంతం ప్రత్యేకంగా అభినందించారు.



సదస్సులో పాల్గొన్న ఇటలీ, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, కెనడా ప్రతినిధులుగా..

నైపుణ్యం గల మానవ వనరులతో ఆక్వారంగం అభివృద్ధి



కోర్సు మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: నైపుణ్యం గల మానవ వనరులను సుసంపన్నం చేయడం వల్ల ఆక్వారంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ–అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం 'రొయ్యల పెంపకంలో మెరుగైన యాజమాన్య విధానాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆక్వా రంగానికి అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, నాణ్యతను నిలుపుకోవడం, విత్తనం నుంచి పెంపకం వరకు, ఆహారం వంటివి ఎంతో జాగ్రత్తలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం మాట్లాడుతూ ఏయూతో అవంతి ఫౌండేషన్ చేసుకున్న ఎంఓయూలో భాగంగా ప్రపంచ స్థాయి మౌలిక వసతులను కల్పించి మంచి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఏయూ–అవంతి ఏఎస్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ ఎ.కె.రెడ్డి మాట్లాడుతూ అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ ఆలోచనలకు ప్రతిరూపంగా నైపుణ్య శిక్షణ కేంద్రం నిలుస్తుందన్నారు. ఏయూ–అవంతి ఏఎస్‌డీసీ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె.ఫణి ప్రకాష్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి 16వ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 20 మంది బీఎఫ్ఎస్సీ, ఎంఎస్సీ, బీఎస్సీ విద్యార్హత కలిగిన వారు తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఏపీ నుంచి శిక్షణకు హాజరవుతున్నట్టు చెప్పారు. 13 రోజులు థియరీ, 17 రోజుల పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. కోర్సు మెటీరియల్‌ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ రామచంద్ర గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

19వ రోజుకు శ్రీలక్ష్మీ పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం నాటికి 19వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు.